ప్రజాశక్తి
బుధవారం 26 మార్చి 2025
5
పార్వతీపురం మన్యం

మన్యం భగభగ

మండుతున్న ఎండలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈ ఏడాది వేసవి ఎండలతో మన్యం జిల్లా భగభగలాడుతోంది. ఫిబ్రవరిలో మొదలైన ఎండల ప్రభావం మార్చిలో మరింత తీవ్ర స్థాయిలో కనిపిస్తోంది. పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటడంతో మధ్యాహ్నం వేళలో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు వ్యాపారాలు, వివిధ రంగాల కార్మికులు ఎండ తీవ్రతకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏప్రిల్, మేలో ఎండల ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని, చల్లటి మజ్జిగ, మంచినీరు ఎప్పటికప్పుడు వినియోగించాలని, తెల్ల వస్త్రాలు ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు.

కలెక్టర్ల సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

రెండు వేల ఎకరాల్లో నిమ్మగడ్డి సాగుకు అవకాశం

సిఎంకు వివరించిన కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో రెండు వేల ఎకరాల్లో నిమ్మగడ్డి సాగు చేసేందుకు అవకాశం ఉందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ రాష్ట్ర ముఖ్యమంత్రికి వివరించారు. రెండు రోజుల జిల్లా కలెక్టర్ల సమావేశం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంగళవారం జరిగింది. తొలి రోజు జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిమ్మగడ్డి పంట సాగుకు జిల్లా అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ ఏడాది వేయి ఎకరాల్లో సాగుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. వచ్చే ఏడాదికి రెండు వేల ఎకరాల్లో సాగుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఒడిశాలోని రైతులు వేల ఎకరాల్లో లెమన్ గ్రాస్‌తో పాటు అంతర్ పంటలను సాగు చేస్తూ అధిక లాభాలను ఆర్జిస్తున్నారని, ఆ దిశగా జిల్లాలోని రైతులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. వేయి ఎకరాల్లో నిమ్మగడ్డితో పాటు 4,240 హెక్టర్లలో అంతర్ పంటలు (ఇతర పంటలు,) సాగు చేసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. నిమ్మగడ్డి, ఇతర పంటలను సాగుచేసేకొనేలా ప్రోత్సహించేందుకు రైతులను ఎక్స్‌పోజర్ విజిట్ కు తీసుకువెళ్లినట్లు కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరించారు. ఏజెన్సీలకు అనుకూలమైన ఇంటర్ క్రాప్స్‌పై దృష్టి సారించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కలెక్టర్‌కు సూచించారు.

ధర్మాసుపత్రిలో 'అధర్మయుద్ధం'

- రచ్చకెక్కుతున్న వైద్యుల విభేదాలు
- సూపరింటెండెంట్ మార్పు తర్వాత తారాస్థాయికి
- గిరిజన సంఘాలతో తప్పుడు ఫిర్యాదులు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని ధర్మాసుపత్రిలో 'అధర్మయుద్ధం' కొనసాగుతోంది. స్థానిక వందపడకల ఏరియా ఆసుపత్రిగా రూపాంతరం చెందిన తర్వాత సూపరింటెండెంట్ కుర్చీకి డిమాండ్ పెరగడంతో వైద్యుల మధ్య విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. నివురుగప్పిన నిప్పులా ఉన్న అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరుతున్నాయి. ఫలితంగా ఆసుపత్రిలో పేదలకు అందే వైద్య సేవలకు ఆటంకం కలిగే అవకాశం కనిపిస్తోంది. రెండు నెలల క్రితం ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ విఆర్ మీనాక్షి బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు సూపరింటెండెంట్‌గా దాదాపు మూడేళ్ళ పాటు డాక్టర్ రత్నకుమారి పని చేశారు. ఆసుపత్రిలో పని చేస్తున్న వైద్యుల్లో తానే సీనియర్ డాక్టర్‌నని, సూపరింటెండెంట్‌గా తనకే అవకాశం ఇవ్వాలని డాక్టర్ విఆర్ మీనాక్షి కోర్టుకు వెళ్లడంతో ఆమెకు అనుకూలంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఆమెను సూపరింటెండెంట్‌గా నియమించారు. అయితే ఆమె నియామకాన్ని జీర్ణించుకోలేని ఒక మహిళా డాక్టర్ కొంతమంది గిరిజన సంఘాల నాయకులతో తప్పుడు ఫిర్యాదులు చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు గిరిజన సంఘాల పేరుతో కొన్ని ఫిర్యాదులు అందాయి. ఆసుపత్రిలో పని చేస్తున్న కొంతమంది గైనకాలజిస్ట్‌లు, ఇతర వైద్యులు సక్రమంగా విధులు నిర్వహించడం లేదని, గిరిజన రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా వైద్య సేవల కోఆర్డినేటర్ విచారణ జరిపించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవల గురించి నేరుగా విచారణ నిర్వహించారు. ఆసుపత్రిలో వైద్య సేవలు సక్రమంగానే అందుతున్నాయని విచారణలో రుజువయినట్లు తెలుస్తోంది. అయితే అంతటితో ఆగకుండా ఓ గిరిజన సంస్థ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసినట్లు తెలిసింది. ఉన్నతాధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేయించడం, హైకోర్టులో పిల్ వేయించడం వెనుక మహిళా డాక్టర్ ప్రమేయం వున్నదనే ప్రచారం జరుగుతోంది. ఈమెకు స్థానిక అధికార పార్టీ నాయకుల అండదండలు కూడా ఉన్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఏరియా ఆసుపత్రి అయిన తర్వాత నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్న తరుణంలో వైద్యుల మధ్య సూపరింటెండెంట్ కుర్చీ కోసం ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతుండడం చర్చనీయాంశమవుతోంది.

ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

మా ఊరు బడిని కాపాడాలంటూ యుటిఎఫ్ ఆధ్వర్యాన మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాసంఘాల నాయకులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. డిఇఒ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ప్లకార్డులు పట్టుకొని ప్రదర్శన చేశారు. అనంతరం అక్కడ నిరసన తెలిపారు. పాఠశాలల ఎత్తివేత ప్రతిపాదనలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులను వేరు చేయవద్దని కోరారు. విద్యార్థులకు ప్రభుత్వ విద్యను దూరం చేయొద్దంటూ డిఆర్ఒ హేమలతకు వినతి ఇచ్చారు. (వివరాలు మెయిన్‌పేజీలో)

డిఆర్ఓకు వినతినిస్తున్న యుటిఎఫ్ నాయకులు

నిరసన తెలుపుతున్న ఎగువ సెంబి గిరిజనులు

చదువే మీకు ఆయుధం : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

పదో తరగతి పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సామరెల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్షలకు బాగా సన్నద్ధమవ్వాలన్నారు. చదువు ఒక్కటే పేదరికాన్ని రూపుమాపగలదని విద్యార్థులకు సూచించారు. చదువు మీకు ఒక ఆయుధమన్నారు. 2023లో రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం ఈ పాఠశాలకు వచ్చిందని ఈ ఏడాది కూడా ఇంకా ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఇంటర్మీడియట్ ఇప్పటి నుండే ప్లాన్ చేసుకొని కళాశాల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. పదో తరగతి పూర్తయ్యాక ఎవరూ చదువు ఆపివేయొద్దని, ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు కొనసాగించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆరిక భాస్కరరావు, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భోజనాన్ని రుచి చూస్తున్న ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

ఒడిశా దూకుడుకు అడ్డుకట్ట వేసేదెప్పుడు?

ఎగువ సెంబి వద్ద గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఆంధ్రా- ఒడిశా సరిహద్దుల్లో నిత్యం వివాదాలు సృష్టిస్తున్న ఒడిశా దూకుడును అరికట్టేది ఎప్పుడని సరిహద్దు గ్రామాల గిరిజనలు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో ఎగువ సెంబి వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒడిశా- ఆంధ్రా సరిహద్దు వివాదాల వల్ల 21 గ్రామాలకు చెందిన గిరిజనులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ ప్రాంతమంతా ఐదో షెడ్యూల్ గ్రామాలుగా ఉన్నాయని, ఇక్కడ ఉండే గిరిజనులకు సర్వహక్కులున్నాయని సుప్రీం కోర్టు చెబుతున్నా ఒడిశా అధికారులు, పోలీసులు దూకుడుగా వ్యవహరిస్తూ గిరిజనుల సాగులోనున్న భూములను దౌర్జన్యం చేస్తూ లాక్కోవడానికి ప్రయత్నించడం సరికాదన్నారు. ఒడిశా దూకుడును అడ్డుకోవాల్సిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని తెలిపారు. ఎన్నో ఆశలతో గెలిపించుకున్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కనీసం స్పందించడం లేదని, ఇప్పటికైనా గిరిజనులకు రక్షణ కల్పించి ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. గిరిజనులు సాగుచేస్తున్న భూములపై ఎటువంటి అనుమతుల్లేకుండా గ్రామసభల ఆమోదం లేకుండా గిరిజనులకు తెలియకుండా వారి భూమిలు లాక్కుని కంచెలు వేసి ఇబ్బంది పెట్టడం సరికాదని తెలిపారు. తక్షణమే వేసిన కంచెను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సరిహద్దు వివాదం పరిష్కారం కోసం కషి చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో గిరిజనులందర్నీ సమీకరించి ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గెమ్మెల జానకీరావు, కోనేటి సుబ్బా, తాడంగి చరణ్, చిరంజీవి, సన్నం, మర్రి మహేషు, గ్రామ గిరిజనులు పాల్గొన్నారు.

ఒప్పందం అమలు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆర్టీసీలో పని చేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ వర్కర్లకు కనీస వేతనం, జాతీయ సెలవులు వర్తింపు, పదో తేదీకి జీతాలు ఇస్తామని కాంట్రాక్టరుతో కుదిరిన ఒప్పందం అమలు చేయాలని కోరుతూ ఆర్టీసీ డిపోమేనేజర్ ఇఎస్ దుర్గకు సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు వినతిపత్రం అందజే శారు. ఒప్పందంపై నాయ కులు సమావేశమై చర్చించిన తర్వాత సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు ఆధ్వర్యాన వినతిపత్రం సమర్పించారు. డిపోలో పనిచేస్తున్న ఆర్టీసి కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ కార్మికులకు ఆర్టీసి విడుదల చేసిన సర్క్యులర్ ప్రకారం కనీసవేతనాలు వెంటనే అమలు చేయాలని, ప్రతి నెలా 10వ తేదీ లోపు చెల్లించాలని, 9 జాతీయ పండగ సెలవులు అమలు చేయాలని, స్థానిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 12న జిల్లా రవాణా అధికారి సమక్షంలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటియు, జిల్లాలోని అన్ని రంగాల ఆర్టీసీ కాంట్రాక్టర్లతో జాయింట్ మీటింగులో అంగీకరించిన ఒప్పందం ప్రకారం డిమాండ్లను వెంటనే అమలుచేయాలని కోరారు. డిపో మేనేజర్ వద్దకు నాయకులంతా వెళ్లి మన డిపోలో కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, యూనియన్ నాయకులు పి.భాస్కరరావు, కుమారస్వామి, కుమార్, రవికుమార్ తదితర కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు.

ఒప్పంద కాపీలు చూపిస్తున్న సిఐటియు నాయకులు, కాంట్రాక్టు ఉద్యోగులు

ఆసక్తి గల కోర్సులపై దృష్టి సారించాలి : పిఒ

ప్రజాశక్తి - పాచిపెంట

పదో తరగతి చదివే విద్యార్థులు తదుపరి విద్యలో ఆసక్తి గల కోర్సులపై ఇప్పటి నుంచే దృష్టి సారించాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే పదో తరగతి పునాది అని అన్నారు. కావున ప్రతి విద్యార్థి కష్టంగా కాకుండా ఇష్టంతో చదివి మంచి ఉత్తీర్ణతను సాధించాలని అన్నారు. మండలంలోని పి.కోనవలసలో గల ఎపి గిరిజన సంక్షేమ వసతి పాఠశాలను పిఒ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ పదో తరగతి చదువుతున్న విద్యార్థులతో మాట్లాడి పలు ఆరోగ్య సూచనలు చేశారు. పదో తరగతి తరువాత ఆసక్తి ఉండే కోర్సులపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండే కోర్సుల పట్ల అవగాహన కల్పించారు. పాఠశాలతో పాటు పరిసరాలను ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచాలని, చెత్త వేయకుండా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వేసవిలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ఎక్కువ మోతాదులో మంచి నీటిని తీసుకోవాలన్నారు. తద్వారా డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారని జాగ్రత్తలు చెప్పారు. అనంతరం భోజనశాలకు వెళ్లి అక్కడ విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, మెనూను స్వయంగా పరిశీలించి, భోజనం రుచి చూశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, విద్యను అందించాలని వసతి గృహ అధికారులను పిఒ ఆదేశించారు. ఈ పర్యటనలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జె.గోపాలపురంలో వైద్య శిబిరం

వీరఘట్టం : మండలంలోని చలివేంద్రి సచివాలయ పరిధి జె.గోపాలపురంలో మంగళవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరపీడితులు, మధుమేహ, గర్భిణీలు రక్తపోటు తదితర వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీడి పంటకు అధిక ధర పొందాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నాణ్యమైన జీడిపంట పండించి రైతులు అధిక దిగుబడులు సాధించడం ద్వారా అధిక ధర పొందాలని సౌత్ ఆసియా సర్టిఫికేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ నీల్‌కాంత్ అన్నారు. మండలంలోని ఆది తల్లి రైతు ఉత్పత్తి దారుల కంపెనీ సభ్యులతో బుడ్డెంఖర్జలో రాష్ట్ర రైతు సాధికార సంస్థ సహకారంతో రైన్ ఫారెస్ట్ అలియన్స్ నిర్వహణలో చేపడుతున్న రైన్ ఫారెస్ట్ అలియన్స్ సర్టిఫికేషన్ కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల పాటు శిక్షణలో ఆయన మాట్లాడారు. రేయన్ ఫారెస్ట్ అలియన్స్ గత 38 ఏళ్ల నుంచి కాఫీ, టీ, అరటి, కోకో, పామ్ ఆయిల్, జీడి, మామిడి, సుగంధ ద్రవ్యాలు మొదలగు పంటలకు సర్టిఫికేషన్ చేయడం జరుగుతుందని తెలిపారు. సుమారు 70కి పైగా దేశాల్లో సర్టిఫికేషన్ చేసి రైతుల ఉత్పత్తులకు అదనపు ధర పొందేలా చేయడం జరుగుతుందని, సర్టిఫికేషన్ చేయడం వల్ల ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతులు చేయడానికి ఆస్కారం కలుగుతుందని అన్నారు. ఆది తల్లి రైతు ఉత్పత్తిదారుల కంపెనీలోని 563 మంది సభ్యులతో వారు పండించే పంటలకు సర్టిఫికేషన్ చేయడానికి, అదనపు ధర పొందేలా జట్టు సంస్థ సహకారంతో ప్రణాళికలు తయారు చేయడం జరుగుతుందని చెప్పారు. దీనివల్ల రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపరడమే కాకుండా పండిన పంటకు సరైన ధర లభించడం వల్ల అదనపు ఆదాయం పొందగలరని అన్నారు. రాబోయే రోజుల్లో రైతులు పండించిన పంటలకు సర్టిఫికేషన్ చేసుకుని తమ ఉత్పత్తులను విక్రయించిస్తే వినియోగదారులు పోటీపడి కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. శ్రమ, దళారులు బెడద లేకుండా, రైతులు ప్రత్యక్షంగా ఆదాయం అందుకోడానికి ఇదొక చక్కని అవకాశమన్నారు. అందుకు రైతులు కూడా వారి ఉత్పత్తులను ఏ విధమైన రసాయన ఎరువులు- పురుగు మందులు వాడుకుండా సహజ సిద్ధంగా లభించే వనరులను ఉపయోగించుకుని పండించుకొని సర్టిఫికేషన్ చేసుకొని అమ్మకాలు జరిపితే అదనపు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సబల్ ప్రాజెక్టు రాష్ట్ర అధికారి పి.వినూత్న, సభ్యులు నేపా, శ్రీధర్, రోజాచంద్, జట్టు కో డైరెక్టర్, ఎపి పిసిపి ఎన్ఎఫ్ ఎంఎంఎల్ గణేష్ శరత్చంద్ర, గొల్లు మురళీ మోహన్, జీవ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.ప్రబోధ్, ఆదితల్లి సిఇఒ పెకాపు మురళీ, డైరెక్టర్లు సీతారాం, ప్రసాద్, మిన్నారావు, భీమారావు, కొండబారిడి లాండ్ స్కేప్ కో ఆర్డినేటర్ మణికుమార్, మా తోట రైతులు పాల్గొన్నారు.

సౌత్ ఆసియా సర్టిఫికేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ నీల్ కాంత్

రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సభ్యులతో మాట్లాడుతున్న నీల్‌కాంత్

పక్కాగా ఆరోగ్య కార్యక్రమాలు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - భామిని

ప్రజారోగ్యం దృష్ట్యా ఆరోగ్య కార్యక్రమాలను పక్కాగా అమలు చేసి పురోగతి సాధించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. మండలంలోని భామిని, బత్తిలి, బాలేరు, సీతంపేట మండలం కుసిమి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను మంగళవారం ఆయన తనిఖీలు చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ పరిశీలించి ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదుపై ఆరా తీశారు. ఒపి రికార్డులో ఆరోగ్య తనిఖీలు, చికిత్సా వివరాలు పరిశీలించి రోగుల ఆరోగ్య సమస్యలు స్పష్టంగా తెలుసుకోవాలని సూచించారు. వార్డులో రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. ల్యాబ్ రికార్డులు తనిఖీ చేశారు. జ్వరాలు ఎక్కడైనా నమోదు అవుతున్నాయా ఆరా తీసి మలేరియా, డెంగీ పరీక్షలు సకాలంలో చేపట్టాలని ఆదేశించారు. మందుల నిల్వలు, ఒఆర్ఎస్ ప్యాకెట్ల లభ్యత పరిశీలించి అన్ని గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో ఒఆర్ఎస్ అందుబాటులో ఉండాలని డీహైడ్రేషన్, వడదెబ్బపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. లేబర్ రూమ్ తనిఖీ చేసి సాధారణ ప్రసవాలు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. ఇహెచ్ఆర్ నమోదు పరిశీలించారు. విద్యుత్ అంతరాయం లేకుండా పిహెచ్సీలో బ్యాటరీ పనితీరు ఎప్పటికప్పుడు చూసుకోవాలన్నారు. పిహెచ్సీ ఆవరణలో న్యూట్రీగార్డెన్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తహీనత నివారణపై సమిష్టిగా కృషి చేయాలని ఎనీమియా యాక్షన్ కమిటీలు నిర్వహిస్తూ పురోగతి సాధించేలా కార్యాచరణ చేయాలని అన్నారు. హైరిస్క్ గర్భిణీల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వేసవిలో ప్రబలే రుగ్మతలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలపై ప్రజలను అప్రమత్తం చేయాలని, ఒఆర్ఎస్, జింక్ కార్నర్స్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ జి.శివకుమార్, డాక్టర్ సోయల్, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ దామోదర్, డాక్టర్ సంతోషిలక్ష్మి, డాక్టర్ చాందిని, డాక్టర్ శివ శంకర్, డిఎస్ఒ శంకర్, సిసి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు అందిస్తున్న వైద్యాన్ని ఆరా తీస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

తైక్వాండో పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందనలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జాతీయస్థాయి తైకాండో పోటీలకు ఎంపికైన విద్యార్థులకు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అభినందనలు తెలిపారు. అనిల్ కుమార్‌శర్మ తైక్వాండో అకాడమీ నుంచి జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. అండర్-19 విభాగంలో నలుగురు, అండర్-14 విభాగంలో ముగ్గురు విద్యార్థులు ఏప్రిల్ 6న మణిపూర్‌లోని ఇంఫాల్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కాగా, ఎమ్మెల్యే విజయచంద్ర వీరికి అభినందనలు తెలిపారు. మీరంతా జిల్లా తరపున విజయం సాధించి, పతకాలతో తిరిగి రావాలని ఆయన ఆశీస్సులు తెలిపారు. కార్యక్రమంలో కోచ్ అనిల్ శర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

బకాయి పన్నులు చెల్లిస్తే 50శాతం వడ్డీ రాయితీ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపాల్టీలో బకాయి ఉన్న ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు ఈనెల 31లోగా చెల్లించి 50శాతం వడ్డీ రాయితీని పొందాలని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతవరకు బకాయి ఉన్న ఆస్తి పన్నులతో పాటు, ఖాళీ స్థలాల పన్నులు, ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చెల్లించాల్సిన పన్నులను చెల్లించిన వారికి 50 శాతం పన్ను వడ్డీ రాయితీ వస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని పన్ను బకాయిదారులు ఉపయోగించుకోవాలన్నారు. వార్డుల్లో గల సచివాలయాల్లో గానీ, adma.ap.gov.in వెబ్సైట్లో ఆన్లైన్లో చెల్లించాలని, ఈ అవకాశం సెలవు దినాల్లో పన్ను బకాయిదారులు ఉపయోగించుకోవచ్చు అన్నారు.

వాతావరణ మార్పులపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని చిన్నబగ్గ పంచాయతీ గోరపాడులో వాతావరణ మార్పులు, విపత్తుల ప్రమాదాలపై సహభాగా అంచనా శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో వెలుగు అసోసియేషన్ డైరెక్టర్ బి.సంజీవరావు మాట్లాడుతూ వాతావరణంలో మార్పు వల్ల వర్షాలు సరైన సమయంలో పడకపోవడంతో పంటలు వెనకబడి ఉందన్నారు. పూర్వమైతే కొత్త అమావాస్య నాటికి జీడిపంట వచ్చేదని,ప్రస్తుతం ఇప్పుడు 80 రోజులు వెనక్కి వెళ్లిందన్నారు. పూర్వీకులు కొండ శిఖరంపై ఉన్న అడవిని కొట్టకుండా కాపాడేవారన్నారు. ఇప్పుడు అవి లేకపోవడంతో భావితరాల పిల్లలకు ఎటువంటి ఆస్తులు ఇస్తారని ప్రశ్నించారు. దీని ద్వారా మంచి వాతావరణాన్ని పొందేవారని, అడవి, చెట్టు, నీరుని సంరక్షించాలని అన్నారు. అడవులను రక్షించాలి.. కాపాడాలి చెప్పారు. అడవిని కొట్టి వ్యవసాయం చెయ్యడం కంటే అడవిని పెంచి ఆదాయం పొందడం మేలన్నారు. ఈ శిక్షణలో చిన్నబగ్గ పంచాయతీ నుంచి తుంబన్నకాలనీ,జరడ కాలనీ, చిన్న గోరపాడు,గోరపాడు, మోహన్ కాలనీ, సుందరయ్య గూడ గ్రామాల నుంచి 115 మంది వచ్చారు.రిసోర్స్ పర్సన్లుగా బి.వెన్నెల, సవర ఆనందరావు వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి చర్యలు, గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించడం, పర్యావరణ వ్యవస్థల రక్షణ, అడవులను రక్షించడం/ పునరుద్ధించడం, పర్యావరణ వ్యవస్థల స్థితిస్థాపకతను పెంచాలని, వాతావరణ మార్పులకు అనుగుణంగా ఉండాలని అవసరమైన చర్యలు తీసుకోవాలని వివరించారు. కార్యకర్తలు వసంత (ఏరియా కోఆర్డినేటర్), పార్వతి, ఉమా, మజ్జయ్య, శంకర్ పాల్గొన్నారు.

తోటల పెంపకంపై జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

జీడి,మామిడి తోటల పెంపకంపై జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానవన శాఖ ఎఒ టి.అమరేశ్వరి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని వండవలో రైతులతో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తోటల పెంపకంపై సస్యరక్షణ జాగ్రత్తలు తీసుకుంటే పిందె దశలో పిచికారీ చేస్తే వృద్ధి చెందడంతో పాటు దిగుబడి కూడా వస్తుందని, తోటల పెంపకంపై రైతులు అవగాహన పెంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పిఒసిసి వై.ఆనందరావు, ఎఫ్ఎం కె.ధర్మారావు, విఎఎ ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

పల్లె పండగ పనుల్లో నాణ్యత కరువు

ప్రజాశక్తి - వీరఘట్టం

పల్లె పండుగ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామానికి నాణ్యతతో కూడిన రహదారుల నిర్మాణ పనులు చేపడతామని ప్రభుత్వం ప్రచారం చేసింది. పనుల సంగతి పక్కన పెడితే నాణ్యత లోపించడంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రోడ్డు పనులు మూడునాళ్ల ముచ్చటగానే మారాయని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇందుకు సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడడమే.

ఎం రాజపురం రోడ్డుకు చేపట్టిన మరమ్మతులు

మండలంలోని ఎం.రాజపురం గ్రామ జంక్షన్ సీఎస్పీ రహదారి నుంచి ఎం.రాజపురం గ్రామం మీదుగా కత్తుల కవిటి వరకు రూ.2కోట్లతో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బిటి రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. కొట్టుగుమ్మడి వంతెన నుంచి కొట్టుగుమ్మడ మీదుగా గడగమ్మ వరకు రూ.కోటి తోనూ, విక్రంపురం గ్రామ జంక్షన్ నుండి కంబరవలస మీదుగా కంబర వరకు రూ.కోటి 10 లక్షలతో ఉపాధిహామీ చట్టం ద్వారా ఐటిడిఎ పర్యవేక్షణలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో బిటి రహదారుల నిర్మాణ పనులు చేపట్టారు. పనులు జరిగినప్పుడు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రస్తుతం ఈ మూడు గ్రామాలకు వేసిన బిటి రహదారులు ఎక్కడికి అక్కడే పెచ్చులూడి దర్శనమిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పది కాలాల పాటు ఉండాల్సిన బిటి రహదారులు రెండు నెలల్లోనే గుంతలు ఏర్పడే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజాధనాన్ని కాపాడాల్సిన అధికారులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడంతో పల్లెపండుగ అభివృద్ధి పనులకు గండి కొట్టినట్లు అయిందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఫిబ్రవరి 5న సీతంపేట ఐటిడిఎ పిఒ సి యశ్వంత్ కుమార్ రెడ్డి రహదారి నిర్మాణ పనులు పరిశీలించి నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆ దిశగా వారు చర్యలు చేపట్టకపోవడంతో ఈ రహదారులు మూడు రోజులు ముచ్చటగా మారాయిని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికే రాజపురం గ్రామ రహదారికి మరమ్మతులు చేపట్టడంతో పనుల నాణ్యత తేటతెల్లమైందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్డు పనులతో పాటు ఇతర అభివృద్ధి పనులను పర్యవేక్షించి, నాణ్యతగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పెచ్చులూడిన కొట్టుగుమ్మడ గ్రామ రహదారి

రెవెన్యూ సిబ్బందితో చర్చిస్తున్న సబ్ కలెక్టర్ సి. యశ్వంత్ కూమార్ రెడ్డి

భూ రీసర్వేను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని భూ రీసర్వే పనులు వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. రీసర్వే ప్రక్రియలో ఎటువంటి తప్పిందాలకు తావులేకుండా పక్కాగా చేపట్టాలన్నారు. మొండెంఖల్, గుమ్మ పంచాయతీల్లో ప్రస్తుతం రెండో విడత పైలట్ విలేజ్ రీసర్వేకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.రవణమ్మ, వీఆర్వోలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన డిఎస్‌సిపై ప్రకటన చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిఒ 3 పునరుద్దరణ, లేదా ఆ తరహా మరో జిఒ ఇచ్చి గిరిజన డిఎస్‌సిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏప్రిల్ మొదటి వారంలో మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చి జూన్ నాటికి నియామకాలు పూర్తి చేస్తామని ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. గిరిజన డిఎస్సీ సంగతేమిటని ప్రశ్నించారు. ఎన్నికల ముందు జిఒ నెంబర్ 3 పునరుద్దరించి గిరిజన (షెడ్యూల్) ప్రాంతంలో ఉపాధ్యాయ, ఉద్యోగాలు గిజనులకే ఇస్తామన్న హామీ నిలబెట్టు కోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 27న పార్వతీపురం ఐటిడిఎ పిఒకు వినతిపత్రం ఇస్తామని, ఇందుకు గిరిజన నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు ఐటిడిఎకు రావాలని రంజిత్ కుమార్ కోరారు.

డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

ఆశాల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఆశా వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని, కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సిహెచ్‌డబ్ల్యూలను ఆశాలుగా గుర్తించాలని, చట్ట బద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, పెన్షన్ ఇవ్వాలని ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక జిల్లా వైద్యాధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్ కామేశ్వరరావుకు వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడేళ్లలో ఆశా వర్కర్లకు కేవలం రూ. వెయ్యి రూపాయలే వేతనం మాత్రమే పెంచింది. దేశవ్యాపితంగా ఒకే రకమైన పనిపరిస్థితులు ఉండాలని, కనీస వేతనాలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి జి. వెంకటరమణ, ఉపాధ్యక్షులు ఇందిర, సిఐటియు నాయకులు బి.సూరిబాబు, ఆశా వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు శాంతి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి - పాలకొండ

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా పాలకొండ నియోజకవర్గానికి సంబంధించి స్థానిక శ్రీ సత్య సాయి డిగ్రీ కళాశాల ఆవరణంలో మెగా జాబ్ మేళా మంగళవారం నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 15 కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ జాబ్ మేళాకు సుమారు 245 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా 83 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ హాజరై మాట్లాడుతూ యువత ఇలాంటి మేళాలను వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా యువతీ, యువకులు మేళాలకు హాజరై సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రాల్లో ఇటువంటి మేళాలు చేపడుతున్నట్లు చెప్పారు. సత్య సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావు, శ్రీ సత్య సాయి మేనేజింగ్ డైరెక్టర్ బి.లక్ష్మీనారాయణ, డివి రమణ, వైస్ ఎంపిపి వి.అనిల్, జాడ శ్రీధర్, పొదిలా కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సిపిఐ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదినెలలు గడిచినా ఇప్పటి వరకూ పేదలకు ఇళ్ల నిర్మాణం, స్థలాల మంజూరుకు సంబంధించి ఒక్క అడుగు ముందుకు పడలేదని, దీంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సొంతింటి కళ నెరవేర్చుకోవాలన్న ఆశ సామాన్య కుటుంబాలకు అందని ద్రాక్షగా మిగిలిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య అన్నారు. మంగళవారం సిపిఐ ఆధ్వర్యంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామేశ్వరరావు జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు నేతృత్వంలో ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టి అనంతరం డిఆర్ఒ హేమలత వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మొదటి విడతగా కొన్ని డివిజన్లో ఉన్న లబ్ధిదారుల ఇంటి స్థలాల దరఖాస్తులు మాత్రమే అందజేశామని, ఇంకా మిగతా వారి నుంచి దరఖాస్తులు సేకరించి రెండో విడత అందజేస్తామని తెలిపారు. సొంత స్థలంలో ఇల్లు కట్టుకునే కుటుంబాలకు ప్రభుత్వం సాయం అందిస్తే ఎన్నో కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. సర్వేల పేరుతో ప్రభుత్వం కాలక్షేపం చేస్తోందని విమర్శించారు. పట్టణ ప్రాంతంలో రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి జీవ, కార్యవర్గ సభ్యులు ఇవి నాయుడు, సూరయ్య, గోపీనాయుడు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఆర్‌విఎస్ కుమార్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు నాగభూషణం, రవి కుమార్, సమితి సభ్యులు పువ్వల ప్రసాద్, బిటి నాయుడు, నీలమ్మ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల విద్యాప్రమాణాలను పరిశీలిస్తున్న ఎంఇఒలు

పెద్దూరు పాఠశాలలో ఎంఇఒల తనిఖీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఇఒలు ఆనందరావు, సూర్యచంద్రరావు మంగళవారం అకస్మికంగా తనిఖీ చేపట్టారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా విద్యార్థులంతా 100 ఎక్కాలు చక చక చెప్పడంతో విద్యార్థుల సామర్థ్యం బాగుందని కితాబు ఇచ్చారు. విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మధ్యాహ్నం భోజనం, రికార్డులను పరిశీలించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయని చెప్పారు. విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, ఉపాధ్యాయుడు నెల్లి సత్యనారాయణ, నేత్ర వైద్య నిపుణులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ త్రివిక్రమరావు

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదబోగిలి, బుడ్డిపేటలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు నిర్ణీత సమయంలో పనులు చేస్తే వారికి వేతనం గిట్టుబాటు ఉంటుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నిబంధనల ప్రకారం పనులు చేయాలన్నారు. వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ఉదయం 6 నుంచి 10 వరకు పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ పి.భాను, ఫీల్డ్ అసిస్టెంట్ అప్పలనాయుడు, వేతనదారులు పాల్గొన్నారు.

మల్లి జిపిఎస్ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దారి మల్లి జిపిఎస్ పాఠశాలను డిప్యూటీ డిఇఒ కంభం రవి ప్రసన్నకుమార్ మంగళవారం సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యం తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనం, విద్యార్థుల హాజరు పరిశీలించారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆటపాటలతో బోధించాలని చెప్పారు. ఆయనతో పాటు ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో అంగన్వాడీ కార్యకర్త మృతి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని శివ్వాంలో గల అంగన్వాడీ కేంద్రం-2)లో కార్యకర్తగా పనిచేస్తున్న పి.భవాని సోమవారం మృతి చెందింది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భవాని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు మృతదేహాన్ని శివ్వాం తీసుకురావడంతో మంగళవారం కొమరాడ ఐసిడిఎస్ పిఒ జి.సుగుణకుమారి, సూపర్వైజర్లు రౌతు లక్ష్మి, నల్ల గౌరమ్మ, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్ల యూనియన్ నాయకులు చింతాడ గౌరమ్మతో పాటు కార్యకర్తలు భవాని మృతదేహంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

గుమ్మలక్ష్మీపురంలో యాత్ర

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ఉమాసహిత కైలాసనాథ పంచమ యాత్ర మహోత్సవాల యాత్ర ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఐదు రోజులపాటు జరిగే యాత్ర సందర్భంగా వేలాది సంఖ్యలో ప్రజలు వస్తారని అంచనా నేపథ్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తుకు చర్యలు చేపడుతున్నారు. జెయింట్ వీల్, కార్ రేసింగ్, డ్రాగన్ ట్రైన్ వంటి చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరికీ వినోదాన్ని పంచేలా యాత్రలో ఏర్పాటు చేశారు. మంగళవారం యాత్ర ఏర్పాట్లను ఎల్విన్‌పేట ఎస్ఐ బిడ్డిక శివప్రసాద్, సర్పంచి గౌరీ శంకర్రావు దగ్గరుండి పర్యవేక్షించారు.

ఘనంగా దుర్గాదేవి వార్షికోత్సవం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక కోట దుర్గ అమ్మవారి ఆలయాన్ని మంగళవారం రెండో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండే భక్తులు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. సర్వజోషుల వెంకటలక్ష్మి నరసింహ శర్మ యాజి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జామి లక్ష్మీనారాయణ, కోట త్రినాధ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని ప్రధాన వీదిలో పేరుకుపోయిన చెత్తా చెదారం

పడకేసిన పారిశుధ్యం

లక్షల్లో నిర్వహణకు ఖర్చు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో పారిశుధ్యం పడకేసింది. 20 వార్డులతో పాటు ప్రధాన రహదారుల్లో పారిశుధ్య అధ్వానంగా ఉంది. నెలకు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు అధికారులు రికార్డులు చూపిస్తున్నప్పటికీ ఆ స్థాయిలో పనులు జరగడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. 20 వార్డుల్లో 354 వీధుల్లో కూడా పారిశుధ్యం అధ్వానంగా ఉందని చెప్పవచ్చు. సచివాలయం శానిటేషన్ కార్యదర్శులు జాడ కూడా కనిపించడం లేదు. ఎక్కడికక్కడ అపారిశుధ్యం తాండమోడుతుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వీధుల్లో రోడ్లపైనే చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. దీన్ని పట్టించుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. లుంబురవారి సెంటర్ నుంచి కోమటిపేట జంక్షన్, మేదర వీధి జంక్షన్‌లో రోడ్లపై పెంట కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నవోదయకు 8 మంది విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జవహర్ నవోదయకు జియమ్మవలస మండలం పెద మేరంగి తిరుమల సాయి హైస్కూల్ నుండి 8 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఒకే పాఠశాల నుంచి 8 మంది విద్యార్థులు ఎంపిక కావడం పట్ల పాఠశాల అకడమిక్ డైరెక్టర్ రౌతు వెంకటరమణ అభినందించారు. ఇప్పటి వరకు ఒకే పాఠశాల నుండి అత్యధిక 133 మంది విద్యార్థులు ఎంపిక కావడం ఉమ్మడి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. కొండగొర్రి షర్మిల, పొట్నూరు చైత్ర, కర్రి జాహ్నవి, గుల్ల కుందన శ్రీ చరణి, కొండగొర్రి వేదంత్, మండంగి కార్తికేయ, ఎర్ర తులసీధర్, గుంట్రెడ్డి మహీధర్ ఎంపికయ్యారు.

సీతానగరం : మండలంలోని గడ్డలుప్పి జంక్షన్లో ఉన్న కృషి విద్యాకేతన్ స్కూల్ విద్యార్థి ఆరో తరగతికి నవోదయ విద్యాలయం సీటుకు మక్కువ మండలం వెంకటబైరిపురం గ్రామానికి చెందిన జాగాన శివకుమార్ ఎంపికైనట్లు కరస్పాండెంట్ కె.శ్రీనివాసరావు తెలిపారు.. దీంతో అతడ్ని తల్లిదండ్రులు, స్కూలు సిబ్బంది అభినందించారు.

వీరఘట్టం: స్థానిక ప్రగతి హైస్కూల్‌లో చదువుతున్న బెజ్జిపురం ఆరాధ్య జవహర్ నవోదయ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎస్.శ్రీనివాస రావు తెలిపారు. విద్యార్థినికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని చిన్నబగ్గ పంచాయతీ, సంకిలిలో బిడ్డిక భాస్కరావు పొలంలో ఎఆర్ఎస్ సీనియర్ సైంటిస్ట్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కొర్ర, రాగి పంటలు కోతలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిరి ధాన్యాలు ప్రాముఖ్యత కోసం రైతులకు వివరించారు. పూర్వం గిరిజనులు ఎక్కువగా చిరుధాన్యాలు పండించి ఆరోగ్యంగా, బలంగా ఉండి ఎక్కువ కాలం బతికేవారని అన్నారు. ప్రస్తుతం బయట ఆహార అలవాట్లు పెరగడం వల్ల సమాజంలో జబ్బులు పెరిగి ఆసుపత్రి వైపు మలుసున్నారని చెప్పారు. దీనివల్ల ఆర్థికంగా నష్టపోతున్నారని వివరించి ఉన్నారు. ప్రస్తుతం గిరిజనులు పండించే పంటలు దేశం మొత్తం పండించి ఆరోగ్యంగా, బలంగా, ఉండి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ప్రభుత్వాలు ఆలోచనాలు చేస్తున్నాయని, దీన్ని అర్థం చేసుకొని రైతులు ముందుకు వెళ్లాలని అవగాహన కల్పించారు. చిరుధాన్య విత్తనాలు నిల్వ చేసుకుని గిరిజన గ్రామాలన్నీ ఈ పంటలు వేసి ఆరోగ్యంగా ఉంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు అసోసియేషన్ ఏరియా కోఆర్డినేటర్ పాలక నాగేశ్వరరావు, రైతులు మండంగి కృష్ణారావు, బిడ్డక భాస్కరరావు, సవర సురేష్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా వేలం పాట

ప్రజాశక్తి వీరఘట్టం

స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన వేలం పాటలు ప్రశాంతంగా జరిగాయి. బస్టాండ్ ఆవరణలో ఏడు షాపులకు మూడు మాత్రమే వేలంపాట జరిగింది. మిగిలిన నాలుగు షాపులకు. ఎవరు ముందుకు రాను కారణంగా ఖాళీగా ఉన్నాయి. అలాగే అంబేద్కర్ జంక్షన్ లోని. ఆరు షాపులకు గానుఐదు షాపులకు మాత్రమే వేలం జరిగింది.

29న ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన సమస్యలపైన పార్వతీపురం ఐటిడిఎ వద్ద ఈనెల 29న జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని గిరిజన సంఘం, సిఐటియు నాయకులు లక్ష్మయ్య, కె.సాంబమూర్తి పిలుపునిచ్చారు. ధర్నాకు సంబంధించిన గోడ పత్రికలు మంగళవారం విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ జీడి పంటతో పాటు ఇతర పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, గుమ్మలక్ష్మీపురం, సాలూరు మండలాల్లో జీడి పిక్కల ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. 80 కేజీల జీడి పిక్కల బస్తాలు రూ.16 వేలకు కొనుగోలు చేయాలని, అన్ని గిరిజన గ్రామాలకు బస్సు, మంచినీరు, రహదారి సౌకర్యాలు కల్పించాలని కోరారు. గిరిజనుల ఉన్నతి చదువు కోసం పీజీ కాలేజీ, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, వంద పడకల హాస్పిటల్ పూర్తి చేయాలని, 3.4.5 తరగతుల విద్యార్థులను చదువుకు దూరం చేసేలా మోడల్ స్కూల్‌ను నిలిపివేయాలని కోరుతూ ఈనెల 29న తలపెట్టిన ఐటిడిఎ వద్ద జరుగు ధర్నాలో గిరిజన ప్రజానీకమంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశు, గిరిజన రైతులు యువకులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు, గిరిజన సంఘాల నాయకులు

క్లాప్ మిత్ర, గ్రీన్ గార్డులకు శిక్షణ

ప్రజాశక్తి - సీతంపేట

పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు సీతంపేట గ్రామపంచాయతీ ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ వద్ద పాలకొండ మండలంలోని క్లాప్ మిత్రులకు, గ్రీన్ గార్డులకు, పంచాయతీ కార్యదర్శులకు ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై రెండు రోజుల శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్‌పిఒ రాంప్రసాద్, ఎంపిడిఒ కె.గీతాంజలి మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి చెత్తను ఏ విధంగా గ్రీన్ అంబాసిడర్లు సేకరించారో అలా సేకరించాలన్నారు. చెత్తను వేరుచేసి వర్మీ కంపోస్ట్‌గా మార్చడంపై అవగాహన కల్పించారు. పాలకొండ ఇఒపిఆర్‌డి టి.కృష్ణారావు, మండలంలో గల అన్ని పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

పాచిపెంట : గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి సంపద కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ కనపరిచి హరిత రాయబారులు, కాపలాదారులు అంకిత భావంతో పనిచేయాలని ఇఒపిఆర్‌డి పి.మల్లేశ్వరరావు కోరారు. పాచిపెంటలో నియోజవర్గ స్థాయి సాలూరు మండలం పంచాయతీ కార్యదర్శులు, హరిత రాయబారులు, హరిత కాపలాదారుల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హరిత రాయబారులు విధులు గురించి వివరిస్తూ సమాజానికి మీ సేవలు చాలా విలువైనవని, ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్త సేకరించి నేరుగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, హరిత రాయబారులు, కాపలాదారులు పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న డిఎల్‌పిఒ ప్రసాద్

ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలి

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజల్లో ఇంకా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిఎల్‌ఎటిఒ డాక్టర్ ఎం.వినోద్ కుమార్ అన్నారు. మంగళవారం టిఆర్టి కోఆర్డినేషన్ సమావేశంలో జరిగిన ఒక కార్యక్రమంలో హెచ్ఐవి ఎయిడ్స్‌కు సంబంధించిన కరపత్రాలు, గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఇంకా చాలా అపోహలు ఉన్నందున ప్రజల మధ్య చైతన్యం కలిగించాలని, మన ప్రాంతంలో హెచ్ఐవి టెస్టింగ్‌ను విస్తతంగా అమలు చేయాలని సూచించారు. తద్వారా కొత్త కేసులను త్వరగా గుర్తించి చికిత్స అందించవచ్చు అని. తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ రూపొందించిన హెచ్ఐవి/ఎయిడ్స్ అవగాహన కరపత్రాలు డాక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో విడుదల చేయబడ్డాయి. కార్యక్రమంలో నాక్ టెక్నికల్ ఎక్స్‌పర్ట్ నజీయ హస్సిన్, జిల్లా సిపిఎం అధిలింగం, జిల్లా ఐసిటిసి సూపర్వైజర్ సాక్షి గోపాలరావు పాల్గొన్నారు.

అటవీశాఖ ఉద్యోగులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్థానిక అటవీశాఖ కార్యాలయంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో యుపిహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ రవిచంద్ర సిబ్బందికి ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్‌మోహనరావు వైద్య శిబిరాన్ని సందర్శించి అక్కడ నిర్వహించిన ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షల వివరాలు పరిశీలించారు. రక్తపోటు, మధుమేహ, హిమోగ్లోబిన్ పరీక్షలు జరిపారు. జనరల్ హెల్త్ చెకప్స్‌లో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన పలు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. వ్యాధులు, దీర్ఘకాలిక రుగ్మతలకు గురికాకుండా మెరుగైన ఆరోగ్యానికి అవసరమైన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, కాలానుగుణ వ్యాధులు, ముందస్తు జాగ్రత్తలు పై వివరించారు. అలాగే ఆరోగ్యం విషయంలో వారు అడిగిన సందేహాలను నివత్తి చేశారు. కార్యక్రమంలో అటవీ శాఖ ఎఒ పి.సాయిబాబు, హెల్త్ సూపర్వైజర్ పుష్ప, ఎపెడిమిక్ ఇఒ సత్తిబాబు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న జిల్లాప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణపై శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం

గ్రామీణ స్థాయిలో మెరుగైన వైద్య సేవలందజేసేందుకు సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ (సిపిహెచ్‌సి) శిక్షణా పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేయాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. వైద్యాధికారులు, సిహెచ్‌ఒలకు బ్యాచ్‌ల వారీగా నిర్వహించిన రీ ఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమం మంగళవారం స్థానిక ఎన్జీఓ హోమ్‌లోజరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహన్ పలు ఆరోగ్య అంశాలపై శిక్షణ ఇచ్చారు. నోటి సంబంధిత వ్యాధులు, చెవి, ముక్కు, గొంతు, దృష్టి సమస్యలు, మానసిక ఆరోగ్యం, రుగ్మతలు, నరాల సంబంధిత వ్యాదులు, వృద్ధుల ఆరోగ్య సంరక్షణ, అత్యవసర ప్రాథమిక వైద్యంపై వివరించారు. పలు రకాల వ్యాధులకు గల మూల కారణాలు, క్షేత్ర స్థాయిలో వాటిని సులభంగా గుర్తించే విధానం, చికిత్స, పర్యవేక్షణ, నివారణా చర్యలను వివరించారు. ఆరోగ్య కేంద్రాల్లో క్షేత్ర స్థాయిలో వైద్య సేవలు మరింతగా విస్తృతం చేసి ప్రజారోగ్యం మెరుగుకు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ పిఎల్. రఘుకుమార్, డాక్టర్ ఎం.వినోద్ కుమార్, కార్యాలయ సిబ్బంది జగన్నాథం, యోగీశ్వరరెడ్డి, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.